సాక్షి యాదాద్రి భువనగిరి

మంగళవారం ၊ 30 ၊ జనవరి ၊ 2024



నిర్లక్ష్యానికి ఆరుగురు బలి

లారీ డ్రైవర్ నిర్లక్ష్యానికి రెండు కుటుంబాలకు చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. - 8లో



వైజ్ఞానికి ప్రదర్శనకు ఎగ్జిబిట్లు

రాష్ట్ర స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనకు యాదాద్రి జిల్లా నుంచి రెండు ఎగ్జిబిట్‌లు ఎంపికయ్యాయి. - 8లో



అక్రమార్కుల పైఎత్తులు

గంజాయి రవాణాను అరికట్టేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నా అడ్డుకట్ట పడడం లేదు. -10లో

న్యూస్‌రీల్

ఫిబ్రవరి 19న వెల్లంకికి గవర్నర్ రాక

రామన్నపేట : రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ ఫిబ్రవరి 19న రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామానికి రానున్నారు. ఈ మేరకు ఆచార్య కూరెళ్ల గ్రంథాలయం వ్యవస్థాపకులు డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆచార్య కూరెళ్ల గ్రంథాలయ భవనాన్ని గవర్నర్ ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. సాహితీప్రియులు, శ్రేయోభిలాషులు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఈవీఎంలపై అవగాహన ఉండాలి



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్

సాక్షి,యాదాద్రి : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)పై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ఈవీఎంలు, వీవీప్యాట్‌లను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. అంతకుముందు కలెక్టరేట్ గోదాములో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, కంట్రోల్ యూనిట్‌లను చెక్ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, కలెక్టరేట్ ఏఓ జగన్‌మోహన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల స్వీకరణ



ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడానికి కలెక్టరేట్‌కు వచ్చిన స్టాఫ్ నర్సు అభ్యర్థులు

భువనగిరిటౌన్ : స్టాఫ్ నర్సు అభ్యర్థుల నుంచి సోమవారం ధ్రువీకరణ పత్రాలు స్వీకరించారు. మెరిట్ లిస్టులో పేరున్న అభ్యర్థులు కలెక్టరేట్‌కు వచ్చి ఆన్‌లైన్ దరఖాస్తుకు జతచేసిన పత్రాలు, ఫొటోతో పాటు సంతకం చేసిన కాపీలను అధికారులకు అందజేశారు. మెరిట్ లిస్టులో జిల్లా నుంచి 84 మంది పేర్లు ఉన్నాయని, వారందరి నుంచి ధ్రువీకరణ పత్రాలు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 31న నియామక ఉత్తర్వులు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా ఉదయం 9 గంటలకే కలెక్టరేట్‌కు వచ్చిన అభ్యర్థులకు.. తాగునీటి సౌకర్యం కూడా కల్పించకపోవడంతో వారు ఇబ్బందులకు గురయ్యారు.

బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు విప్ జారీ?

మోత్కూరు : మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రిమేఘారెడ్డిపై అవిశ్వాసానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు విప్ జారీ చేసినట్లు తెలిసింది. చైర్‌పర్సన్ సావిత్రి (బీఆర్‌ఎస్)పై ఐదుగురు బీఆర్‌ఎస్, నలుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాసం కోరుతూ ఈ నెల 20వ తేదీన కలెక్టర్‌కు సంతకాలతో కూడిన తీర్మానం నోటీసు అందజేశారు. నాటి నుంచి ఇరు పార్టీలకు చెందిన తొమ్మిది మంది కౌన్సిలర్లు క్యాంపులోనే ఉన్నారు. వచ్చే నెల 9వ తేదీన అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించడానికి కౌన్సిలర్లకు కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. కాగా బీఆర్‌ఎస్ పార్టీ సింబల్‌పై గెలిచిన ఏడుగురు కౌన్సిలర్ల నుంచి చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఉన్నారు. వారందరికీ విప్ జారీ చేసినట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి తెలిపారు.

ఎయిమ్స్‌లో వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వైద్యులు, విద్యార్థులు

బీబీనగర్ : మండల కేంద్రంలోని ఎయిమ్స్ వైద్య కళాశాలలో సోమవారం మెడికల్ లిటరేచర్ సెర్చింగ్ అండ్ రెఫరెన్సింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా మాట్లాడుతూ పరిశోధనలు చేయడానికి నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఇటువంటి వర్క్‌షాప్‌లు విద్యార్థులకు ఎంతో దోహదపడుతాయన్నారు. సూచించారు. ఈ కార్యక్రమంలో డీన్ రాహుల్ నారంగ్స్, రీసెర్చ్ ప్రొఫెసర్ సంగీత, వైద్యులు అపర్ణ, లక్ష్మిజ్యోతి పాల్గొన్నారు.



భువనగిరిలోని ఆధార్ నమోదు కేంద్రం వద్ద కిక్కిరిసిన జనం

ఆధార్ అప్‌డేట్‌కు తిప్పలు

భువనగిరిటౌన్ : సంక్షేమ పథకాలు, ఇతర అవసరాలకు ప్రభుత్వం ఆధార్ తప్పనిసరి చేయడంతో అడ్రస్, పేర్లు, చిరునామా, ఫోన్ నంబర్ల మార్పుతో పాటు నూతన కార్డుల కోసం జనం పెద్ద ఎత్తున ఆధార్ సెంటర్లకు వస్తున్నారు. ఉదయం నుంచే బారులుదీరుతున్నారు. సోమవారం భువనగిరిలోని ఆధార్ నమోదు కేంద్రాలకు జనం పోటెత్తారు. టోకెన్లు తక్కువ.. జనం ఎక్కువగా రావడంతో చంటి పిల్లలతో వచ్చిన వారు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆధార్ కేంద్రాలు పెంచాలని కోరుతున్నారు.

భువనగిరి సమగ్రాభివృద్ధిపై ముఖ్యమంత్రి దృష్టి

- సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష
- యాదాద్రిలో వసతులు, మూసీ ప్రక్షాళనకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశం
- హైవేల వెంట ఇండస్ట్రీయల్ కారిడార్ల ఏర్పాటుపై దృష్టి
- ఎయిమ్స్‌కు త్వరలో రానున్న రాష్ట్ర అధికారుల బృందం



వ్యర్థ రసాయనాల కారణంగా నురగలు కక్కుతున్న మూసీ

సాక్షి, యాదాద్రి : జిల్లా అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షల్లో పలు ప్రాజెక్టులపై చర్చ కొనసాగింది. గత ప్రభుత్వంలో చేపట్టి పూర్తికానివి, కొత్తగా చేపట్టవలసిన పనులపై సమీక్షించారు. అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో అభివృద్ధిపై జిల్లావాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

మూసీ ప్రక్షాళన..

మూసీ నది ప్రక్షాళనపై ముఖ్యమంత్రి ఫోకస్ పెట్టారు. పరిశ్రమలు విడుదల చేస్తున్న వ్యర్థ రసాయనాల వల్ల వ్యవసాయం, అనుబంధ రంగాలు, ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది. మూసీ ప్రక్షాళన చేస్తామని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటించినా అమలు కాలేదు. ఇటీవల దావోస్ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి.. లండన్ నగరంలోని థేమ్స్ నదిని సందర్శించారు. థేమ్స్ నదిలా మూసీని తీర్చిదిద్దాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

హైవేల వెంట పరిశ్రమలు

పారిశ్రామిక ప్రగతి ఒకే చోట కేంద్రీకృతం కాకుండా నలుదిక్కులా అభివృద్ధి జరిగేలా మెగామాస్టర్ పాలసీ తెస్తామని సీఎం ప్రకటిచారు.అందులో భాగంగా యాదాద్రి జిల్లా పరిధిలోని హైదరాబాద్- వరంగల్, హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారు వెంట ఇండస్ట్రీయల్ కారిడార్‌ల ఏర్పాటుపై సమీక్షలో చర్చించారు. హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు లోపలి వైపు అర్బన్ క్లస్టర్‌గా, ఔటర్ రింగ్ రోడ్డు- రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ఉన్న ప్రాంతాన్ని సెమీ అర్బన్ క్లస్టర్‌గా, రీజినల్ రింగ్ రోడ్డు ఆవల ఉన్న ప్రాంతాన్ని రూరల్ క్లస్టర్‌గా ప్రకటించే అవకాశం ఉంది.

'రీజినల్' బాధితులకు పరిహారం

రీజినల్‌రింగ్ రోడ్డు భూ సేకరణ వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఉన్నతస్థాయి సమీక్షలో అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు భూసేకరణకు కసరత్తు చేస్తున్నారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా వసతులు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ ఆలయంలో భక్తుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు మెరుగుపరచాలని, ఇందుకోసం ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సీఎం సూచించారు. ఆలయంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన నిర్మాణాలు, కల్పించిన సౌకర్యాలు, పెండింగ్ పనులు, వస్తున్న భక్తుల సంఖ్య తదితర అంశాలపై అధికారుల ద్వారా సమీక్షించారు.





ఎయిమ్స్‌లో మెరుగైన వైద్యం

బీబీనగర్‌లో ఎయిమ్స్‌లో సౌకర్యాలను మెరుగుపరిచి నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు తీసుకోనున్నారు. సోమవారం హైదరాబాద్‌లో వైద్యారోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎయిమ్స్‌లో సౌకర్యాలు, వైద్య సేవలపై సీఎం సమీక్షించారు. భవన నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్ సేవలను మెరుగుపర్చాలన్నారు. ఎయిమ్స్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఉమ్మడి నల్లగొండతో పాటు ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాలకు ప్రయోజనం ఉంటుందని, ఉస్మానియా, నిమ్స్‌పై భారం తగ్గుతుందని అధికారులకు సూచించారు. రాష్ట్రస్థాయి అధికారుల బృందం ఎయిమ్స్‌ను సందర్శించి రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. తాను కేంద్రమంత్రిని కలిసి వివరిస్తానని సీఎం ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు బాధాకరం

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కంచర్ల రామకృష్ణారెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరి : జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం భువనగిరిలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పరంగా నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్‌పై వ్యక్తిగత దూషణలకు దిగడమే కాకుండా కేసీఆర్, కేటీఆర్‌పైనా అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రశ్నించినందుకు జెడ్పీ చైర్మన్‌ను దూషించి వేదికపై నుంచి పోలీసుల చేత పంపించడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేనిపక్షంలో బీఆర్‌ఎస్ సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందన్నారు. ఫిబ్రవరి 1నుంచి నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. టికెట్ ఎవరికి వచ్చినా గెలుపునకు కృషి చేస్తామన్నారు. భువనగిరి మున్సిపల్ కౌన్సిల్‌లో తమ పార్టీకి మెజార్టీ ఉందని, పార్టీ సూచించిన వ్యక్తి చైర్మన్ అవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జడల అమరేందర్, రైతు సమన్వయ సమితి మాజీ కన్వీనర్ కొల్పుల అమరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ అంజనేయులు, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, బీబీనగర్ పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మంత్రికి అహంకారం తలకెక్కింది'

యాదగిరిగుట్ట : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రౌడీలాగా ప్రవర్తిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ మండిపడ్డారు. జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిని ప్రజావేదికపై అసభ్యకరంగా మాట్లాడటాన్ని సోమవారం ఒక ప్రకటనలో ఆయన ఖండించారు. కేబినెట్ హోదా కలిగిన జెడ్పీ చైర్మన్‌ను మంత్రి తన బాధ్యత మరిచి వ్యక్తిగత దూషణలు చేయడం సరైంది కాదన్నారు. అదే విధంగా మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలను మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఖండించారు. అధికారంలో ఉన్నారని మంత్రికి అహంకారం తలకెక్కి మాట్లాడుతున్నారని, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిపై ఆయన చేసిన వ్యాఖ్యలను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలన్నారు.

ప్రజావాణిలో 22 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరిటౌన్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై 22 మంది వినతులు అందజేశారు. అదనపు కలెక్టర్‌భాస్కర్‌రావు, డీఆర్‌ఓ పద్మజారాణి, ఉన్నతాధికారులు అర్జీలను స్వీకరించారు. అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు.

వినతులు ఇలా..

- తమ గ్రామాన్ని నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలని సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం అవాసం ఆరెగూడెం గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.
- తన భూమి ఆక్రమించి అపార్ట్‌మెంట్ నిర్మించే ప్రయత్నం చేస్తున్నాడని యాదగిరిగుట్ట మండలం యాదగిరిపల్లికి చెందిన గాజుల క్రిష్ణ దేవస్థానం ఏఈఓ వేముల రామ్మోహన్‌పై ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.
- వృద్ధాప్యంలో తన కుమారుడు తన పోషణ చూడడం లేదని మోత్కూర్ మండలం దాచారం గ్రామానికి చెందిన వృద్ధురాలు అనసూయ వినతిపత్రం అందజేశారు. వీటితో పాటు మరికొన్ని వినతులు వచ్చాయి.

జేడీగా సుబ్బారావు

నల్లగొండ అగ్రికల్చర్ : నల్లగొండ జిల్లా పశు వైద్య సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్‌గా ఎంవి సుబ్బారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. . డాక్టర్ వి.శ్రీనివాసరావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. సుబ్బారావు గతంలో నల్లగొండ జిల్లా జేడీగా పని చేశారు.

చేసిందే చెబుతాం.. చెప్పిందే చేస్తాం



గూడూరులో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు

- బీఆర్‌ఎస్‌లా మోసం చేయం
- కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బీబీనగర్ : కాంగ్రెస్ పార్టీ చెప్పిందే చేస్తుంది.. చేసిందే చెప్పుకుంటుదని, బీఆర్‌ఎస్‌లాగా మోసం చేయదని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బీబీనగర్ మండలం కొండమడుగు, గూడూరు గ్రామాల్లో నూతనంగా నిర్మించి పంచాయతీ భవనాలను ఆయన సోమవారం ప్రారంభించారు. అలాగే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మహాదేవ్‌పురంలో బస్‌షెల్టర్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలోనే పేదలకు న్యాయం జరుగుతుందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని చెప్పారు. త్వరలో మరో రెండు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని చెప్పారు. ఇందిరమ్మ కమిటీలు వేసి అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. సీఎంతో మాట్లాడి యాదాద్రి కలెక్టరేట్‌కు రావి నారాయణరెడ్డి పేరు పెట్టేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళనకు సీఎం కట్టుబడి ఉన్నారని, కొండమడుగు ప్రాంతాన్ని రెసిడెన్సియల్ జోన్‌గా మారుస్తామని చెప్పారు. భువనగిరి మండలంలో 10 ఎకరాల్లో అధునాతన సౌకర్యాలతో స్టేడియం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అవసరమైన చోట డబుల్ రోడ్లు, మూసీ వంతెనలపై హైలెవల్ వంతెనలు నిర్మిస్తామన్నారు. బీబీనగర్ ఎయిమ్స్ అభివృద్ధికి పాటుపడ్డానని రూ.1,100 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ రూ.6 లక్షల కోట్ల అప్పులు చేసి కూడా ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయారని విమర్శించారు. వాసాలమర్రి గ్రామాన్ని కూలదోసి చేతులు దులుపుకున్నాడని, ఆ గ్రామాన్ని తామే తిరిగి అభివృద్ధి చేయాల్సి వస్తుందన్నారు.

అభివృద్ధికి పాటుపడతా : ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

నియోజకవర్గ అభివృద్ధికి పడుతానని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సీఎంతోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డికి జిల్లాతో మంచి అనుబంధం ఉందని, వారి సహకారంతో భువనగిరి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. సాగునీటి కాల్వలకు మరమ్మతులు చేయిస్తానన్నారు. అంతకుముందు మంత్రికి కాంగ్రెస్ శ్రేణులు, అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే, జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీటీసీ గోలి ప్రణీతాపింగళ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు బాల్‌రెడ్డి, లతరాజేష్, వేణుగోపాల్, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ శ్రీవాణి, పంచాయతీరాజ్, అధికారులు, కాంగ్రెస్ నాయకులు రామాంజనేయులు, శ్యామ్ గౌడ్, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



హోటల్ ఎదుట ఏర్పాటు చేసిన షెడ్డును తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల స్థలాలను కబ్జా చేసి సీసీ రోడ్లు వేయడం, భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై 'రోడ్ల స్థలాలు కబ్జా' అనే శీర్షికతో ఈనెల 29న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్ సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. యాదగిరిగుట్ట నుంచి రాయగిరికి వెళ్లే ప్రధాన రహదారిలో శ్రీరాఘవేంద్ర హోటల్ వద్ద రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని, సుప్రభాత్ హోటల్ ఎదుట నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన షెడ్డును పోలీసు బందోబస్తు మధ్య తొలగించారు. రోడ్డు మధ్యనుంచి మార్కింగ్ వేసి అక్రమ నిర్మాణాలను కూడా తొలగిస్తామని చెప్పారు. సెట్‌బ్యాక్ నిబంధనలు తూచ తప్పక పాటించాలని, అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్‌లో శానిటరీ ఇన్స్‌స్పెక్టర్ దండు కిరణ్‌బాబు, జూనియర్ అసిస్టెంట్లు నర్సింహా, ఇస్తారి, సిబ్బంది శేషగిరి, రామకృష్ణ, బుగ్గ శేఖర్, బూడిద కుమార్ పాల్గొన్నారు.

అప్పు తెచ్చి పనులు చేశాం

మూడేళ్లుగా బిల్లులు రాలేదని సర్పంచ్‌ల ఆవేదన

- రేపటితో ముగియనున్న పదవీకాలం
- తమనే కొనసాగించాలని ప్రభుత్వానికి వేడుకోలు



ఇది రామన్నపేట మండలం సూరారంలో నిర్మించిన వైకుంఠధామం. సర్పంచ్ పోలగోని అండాలు పుట్టిన కాదల్లా అప్పుతెచ్చి రెండేళ్ల క్రితం వైకుంఠధామం పూర్తి చేశారు. రూ.12.60 లక్షలకు రూ.7.25లక్షల బిల్లు వచ్చింది. పెండింగ్ బిల్లు కోసం భువనగిరి, హైదరాబాద్‌కు ఆఫీసులకు వెళ్తే చేసిన పనికి సంబంధించి ఐడీ లాక్ అయిందని, ఢిల్లీ నుంచి అప్రూవల్ వస్తేనే బిల్లు మంజూరవుతుందని అధికారులు చెప్పినట్లు సర్పంచ్ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పు ఇచ్చినవాళ్లకు సమాధానం చెప్పలేకపోతున్నామని వాపోయారు. ఇటువంటి పరిస్థితినే జిల్లాలో చాలా మంది సర్పంచ్‌లు ఎదుర్కొంటున్నారు.

రామన్నపేట : గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు సొంత డబ్బులతో చేపట్టిన పనులకు సంవత్సరాలు గడిచినా బిల్లులు రావడం లేదు. వైకుంఠధామాలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాల కోసం లక్షల రూపాయలు అప్పు తెచ్చిపెట్టారు. మరో రెండు రోజుల్లో పదవీకాలం ముగియనుండడం, ఈ దశలో కూడా బిల్లులు అందకపోవడంతో సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 421 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పల్లెప్రగతిలో భాగంగా ప్రతి గ్రామంలో వైకుంఠధామం నిర్మించాలని 2019లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ఒక్కో గ్రామానికి రూ.12.60 లక్షల చొప్పున ఉపాధిహామీ నిధులు మంజూరు చేసింది.వైకుంఠధామాల్లో స్నానపుగదులు, స్టోర్‌రూం, బర్నింగ్ ప్లాట్‌ఫామ్, రెండు దింపుడు కళ్లాలు, ముందుభాగంలో ప్రహరీ, గేట్ ఉండేవిధంగా డిజైన్ చేశారు. నిధులు నేరుగా పంచాయతీల ఖాతాల్లో జమ అవుతాయి. అయితే నిధులు మంజూరు కాకపోవడంతో 90శాతానికి పైగా గ్రామాల్లో సర్పంచ్‌లు సొంత డబ్బులతో వైకుంఠధామాల పనులు చేపట్టారు.

తెలంగాణ క్రీడా ప్రాంగణాల బిల్లులూ పెండింగే..

జిల్లాలోని 421 గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ స్థలాల్లో తెలంగాణ క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. వీటికి కూడా సర్పంచ్‌లు చేతి నుంచి డబ్బులు ఖర్చు చేసి పూర్తి చేశారు. ఒక్కో క్రీడా ప్రాంగణానికి రూ.30వేల నుంచి రూ.60వేల వరకు వెచ్చించారు. ఇప్పటి వరకు బిల్లులు రాలేదు.

బంగారం కుదవపెట్టాను



"మాది కొత్త పంచాయతీ. ఆదాయ వనరులు లేవు. ఏజెన్సీవారు వైకుంఠధామం పనులు ప్రారంభించి బేస్మెంట్ దశలో వదిలేశారు. అధికారులు ఒత్తిడి తెస్తే అప్పు తెచ్చా. అయినా డబ్బులు సరిపోకుంటే బ్యాంకులో బంగారం కుదువపెట్టాను. వడ్డీ పెరుగుతుంది. ఇంకా రూ.4.70 లక్షల బిల్లు రావాలి. వీధిదీపాలు, మోటార్ల రిపేర్ బిల్లు కూడా తీసుకోలేదు.

–జిల్లెల లక్ష్మమ్మ, సర్పంచ్, కొమ్మాయిగూడెం

అప్పుల భారంతో సతమతం

వైకుంఠధామాల పనులు త్వరగా పూర్తి చేయించాలని అప్పటి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు సర్పంచ్‌లపై ఒత్తిడి తెచ్చారు. దీంతో సర్పంచ్‌లు అప్పు తెచ్చి పనులు చేపట్టారు. కొంతమంది బంగారు ఆభరణాలు కుదువపెట్టి డబ్బులు సమకూర్చుకున్నారు. బిల్లులు విడుదల చేయడంలో ఆలస్యం అవుతుండడంతో గ్రామ పంచాయతీల్లో నిధుల లభ్యతను బట్టి రూ.2లక్షల వరకు అడ్వాన్స్ తీసుకునే వెసులుబాటు కల్పించారు. 2020 సంవత్సరం చివరి నాటికి నిర్మాణపనులు పూర్తయ్యాయి. మూడేళ్లు కావస్తున్నా పూర్తిస్థాయిలో బిల్లులు రాలేదు. ఎంబీ రికార్డుల సమర్పణ ఆధారంగా ఒక్కో నిర్మాణానికి రూ.8లక్షల నుండి రూ.9.50లక్షల చెల్లించారు. ఇంకా రూ.3లక్షల నుంచి రూ.4.50 లక్షల వరకు బిల్లులు రావలసి ఉన్నది. పూర్తిస్థాయి బిల్లులు వచ్చినవారి సంఖ్య వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. కొన్ని గ్రామాల్లో అనువైన స్థలం లేక అదనపు ఖర్చు చేయవలసి వచ్చింది.



జిల్లాలోనే ప్రథమంగా జనంపల్లిలో నిర్మించిన వైకుంఠధామం

క్లుప్తంగా

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

భువనగిరి క్రైం : రైలు నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. భువనగిరి, వంగపల్లి మధ్య గల 248/10–12 దిగువ లైన్ రైలుపట్టాల పక్కన సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించి ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జె.కృష్ణారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు తెలుగు రంగు గీతల చొక్కా, బుడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడడంతోనే మృతిచెంది ఉంటాడని భావిస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రిలో భద్రపరిచినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, వివరాలకు 9848222169, 8712568454 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి ఒకరు మృతి


ఓర్సు మైసయ్య (ఫైల్)

గుండాల : ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గుండాల మండలంలోని మాసాన్‌పల్లి గ్రామంలో సోమవారం జరిగింది. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓర్సు మైసయ్య కూలీగా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం గ్రామ శివారులో కాలకృత్యాలు తీర్చుకుని వస్తుండగా కాలుకు గడ్డి తగిలి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై పడిపోయాడు. దీంతో మైసయ్య విద్యుదాఘాతానాకి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు. వ్యవసాయ బావి వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయక పోవడంతోనే తన భర్త మృతిచెందినట్లు మైసయ్య భార్య మైసమ్మ ఆరోపించింది. మృతదేహాన్ని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సందర్శించారు. మృతుడి కుటుంబానికి సానుభూతి సంతాపం తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆలేర ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ యాకన్న తెలిపారు.

నిర్లక్ష్యానికి ఆరుగురు బలి

- ముందు వెళ్తున్న లారీడ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పిన కారు
- ఆపై డివైడర్‌ను ఢీకొట్టి ఏపీవైపు వెళ్లే మార్గంలో బోల్తా
- అదే సమయంలో వేగంగా వచ్చి కారును ఢీకొట్టి ఈడ్చుకెళ్లిన పొట్టులోడు లారీ
- అక్కడికక్కడే ఐదుగురు.. చికిత్స పొందుతూ మరొకరు మృతి


మిర్యాలగూడ ఆస్పత్రిలో రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు


కూతురు రిషితతో మహేష్, జ్యోతి దంపతులు (ఫైల్)


కుమారుడు లియాన్స్‌తో మశ్చేంద్ర, మాధవి దంపతులు (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్ : ఒకరి నిర్లక్ష్యం రెండు కుటుంబాలను బలి తీసుకుంది. ముందుగా వెళ్తున్న లారీ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో దాని వెనకే వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవతలిరోడ్డుపై బోల్తాకొట్టింది. ఇదే సమయంలో ఆ మార్గంలో వేగంగా వెళ్తున్న పొట్టు లారీ బోల్తాపడిన కారును ఢీకొట్టి కొంత దూరం ఈడ్చుకెళ్లడంతో అందులో ప్రయాణిస్తున్న ఆరుగురిలో ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతిచెందారు. ఇదీ.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వద్ద ఆదివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి గల కారణమని పోలీసుల విచారణలో వెల్లడైంది. డీఎస్పీ వెంకటగిరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలం నందిపాడు గ్రామానికి చెందిన చెరుపల్లి మహేష్, యాదాద్రి జిల్లా వలిగొండ మండలం గొల్నేపల్లి గ్రామానికి చెందిన తన తోడల్లుడు బొమ్మ మశ్చేందర్ కుటుంబ సభ్యులు, మిర్యాలగూడ వెంకట్, కుమార్ అనే సమీప బంధువుల కుటుంబ సభ్యులతో కలిసి దైవదర్శనం నిమిత్తం రెండు కార్లలో 26న ఉదయం 5:30 గంటలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బయలుదేరారు. 26న ఏపీలోని పెనుగంచిప్రోలు, విజయవాడ దుర్గమ్మ ఆలయాలను దర్శించుకుని 27న మచిలీపట్నం బీచ్‌కు వెళ్లారు. అక్కడి నుంచి ఈ నెల 28న మోపిదేవిలో శని పూజలు నిర్వహించి కోటప్పకొండ ఆలయాలను దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు.

ఢీకొట్టి.. 45 అడుగుల దూరం ఈడ్చుకెళ్లి..

మార్గమధ్యలో దామరచర్ల మండలం కొండ్రపోలు వద్ద ఆదివారం రాత్రి 10గంటల సమయంలో ఓ దాబాలో టిఫిన్ చేసి తిరుగు ప్రయాణమయ్యారు. స్నేహితులు ప్రయాణిస్తున్న కారు వారి ఇంటికి ఐదు నిమిషాలు ముందుగా చేరుకోగా మహేష్, మశ్చేందర్ కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న కారు పట్టణంలోని కృష్ణమానస కాలనీ వద్ద బైపాస్‌పై ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. రోడ్డుపై ముందుగా వెళుతున్న ఓ లారీడ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో దాని వెనకే ఉన్న కారు ప్రమాదాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఏపీ వైపు వెళ్లే మార్గంలో బోల్తాపడింది. అదే సమయంలో గుంటూరు వైపునకు వెళ్తున్న పొట్టు లారి బోల్తా కొట్టిన కారును సుమారు 45 అడుగుల మేర ఈడ్చు కెళ్లడంతో నుజ్జునుజ్జయింది. దీంతో కారు డ్రైవింగ్ చేస్తున్న చెరుపల్లి మహేష్(32), ఆయన భార్య జ్యోతి(30) కుమార్తె రిషిత(6), యాదాద్రి జిల్లా వలిగొండ మండలం గొల్నేపల్లి గ్రామానికి చెందిన తోడల్లుడు బొమ్మ మశ్చేంద్ర (29) కుమారుడు లియాన్స్(2) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. కొన ఊపిరితో కారు వెనుక సీట్లో కూర్చున్న మశ్చేందర్ భార్య మాధవి(24)ని స్థానికుల సహాయంతో పోలీసులు బయటకు తీసి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. నందిపాడుకు చెందిన చెరుపల్లి మహేష్ హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో నివాసం ఉంటూ అవుట్‌డోర్ ఫొటోగ్రాఫర్‌గా జీవనం సాగిస్తుండగా మశ్చేందర్ చౌటుప్పల్ మండలంలో కేబుల్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు.

మృతుల నేత్రాలు దానం

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చెరుపల్లి మహేష్ ఆయన భార్య జ్యోతిల నేత్రాలను వారి కుటుంబ సభ్యుల అనుమతి మేరకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సేకరించి హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్‌కు అందించినట్లు తెలిపారు. తాము చనిపోయినా నలుగురికి కంటి చూపు అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పొట్టు లారీని పట్టుకున్న పోలీసులు

కారును ఢీకొట్టిన తర్వాత ఆపకుండా వెళ్లిపోయిన పొట్టు లారీని సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అద్దంకి వద్ద పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీని స్టేషన్‌కు తరలించినట్లు టుటౌన్ ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

గొల్నేపల్లిలో విషాదఛాయలు


గొల్నేపల్లిలో మృతదేహాలకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి

వలిగొండ : వలిగొండ మండలం గొల్నేపల్లి గ్రామానికి చెందిన బొమ్మ మశ్చేందర్ (32) అతడి భార్య మాధవి(26) కుమారుడు నియాన్స్ (2) మిర్యాలగూడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో అతడి స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోస్టుమార్టం అనంతరం గ్రామానికి చేరుకున్న మృతదేహాలను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని తెలిపారు. అనంతరం మృతదేహాలకు దహన సంస్కారాలు నిర్వహించారు.



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మాజీ ఎమ్మెల్యే జూలకంటి పరామర్శ

కారు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు చనిపోవడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం ఏరియా ఆస్పత్రిలో గల మార్చురీలో ఉన్న మృతదేహాలను సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఆస్పత్రిలో మిన్నంటిన రోదనలు


మృతుల కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

రోడ్డు ప్రమాదంలో రెండు కుటుంబాలు మృతిచెందడంతో విషయం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు ఏరియా ఆస్పత్రి వద్దకు భారీగా చేకుని కన్నీరుమున్నీరయ్యారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఏరియా ఆస్పత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. పోస్టుమార్టం అనంతరం చెరుపల్లి మహేష్, జ్యోతి(30) రిషిత(6) మృతదేహాలను స్వగ్రామం నందిపాడుకు తరలించి దహన సంస్కారాలు పూర్తి చేశారు.

మేనత్త అన్నీ తానై..


రోదిస్తున్న మాధవి, జ్యోతిల పెంపుడు తల్లిదండ్రులు దేవులపల్లి పద్మ, నాగభూషణం

నందిపాడుకు చెందిన దేవులపల్లి పద్మ తన అన్న కూతుళ్లు అయిన జ్యోతి, మాధవిలను చిన్న తనంలోనే దత్తత తీసుకుంది. అప్పటినుంచి వారికి అన్నీ తానై భర్త ఆమె భర్త నాగభూషణంతో కలిసి పెంచి పెద్ద చేసింది. ఓ రైస్ మిల్లులో వాచ్‌మన్‌గా పని చేస్తున్న నాగభూషణం పెంచుకుంటున్న జ్యోతిని బీఎస్సీ బీఈడీ, మాధవిని బీటెక్ వరకు చదివించారు. ఎనిమిదేళ్ల క్రితం నందిపాడుకు చెందిన మహేష్‌తో జ్యోతికి, మూడేళ్ల క్రితం మాధవికి మశ్చేందర్‌తో వివాహాలు జరిపించారు. మేన కోడళ్లను కన్నబిడ్డలుగా పెంచుకున్న జ్యోతి, మాధవిలు ఇక లేరన్న చేదునిజాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. పెంచుకున్న పిల్లలిద్దరితో పాటు వారి భర్తల మృతదేహాల వద్ద ఆ పెంపుడు తల్లి(మేనత్త) రోదిస్తున్న తీరు పలువురిని కంట తడి పెట్టించింది.

డివైడర్‌పైకి ఆర్టీసీ బస్సు


రోడ్డు డివైడర్ ఎక్కిన ఆర్టీసీ బస్సు

ఆలేరు రూరల్: ఆలేరు శివారులోని హైదరాబాద్ – వరంగల్ రహదారిపై కందిగడ్డతండా శివారులో సోమవారం జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డివైడర్‌పైకి దూసుకెళ్లింది. హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళుతున్న బస్సు కందిగడ్డతండ సమీపంలోకి రాగనే అదుపు తప్పి రోడ్డు డివైడర్ పైకి దూసుకెళ్లింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో మొత్తం 40 మంది ప్రయాణికులు ఉన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

గరిదేపల్లి: తాడి చెట్టు పైనుంచి జారిపడడంతో ఓ గీత కార్మికుడికి గాయాలయ్యాయి. గరిడేపల్లి మండల పరిధిలోని గడ్డిపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు అనంతు చిన్నభిక్షం రోజువారీగా సోమవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో మోకు జారి కిందపడిపోయాడు. అటుగా వెళ్తున్న వ్యక్తులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం ఓ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు రెండు కాళ్లు విరిగి పోయినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

మహా శివుడికి విశేష అభిషేకాలు


మహా శివుడికి పూజలు చేస్తున్న పూజారులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు విశేషంగా కొనసాగాయి. కొండపైనే అనుబంధ ఆలయమైన శ్రీపర్వత వర్ధిని సమేతా రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు విశేషంగా నిర్వహించారు. మహాశివుడికి ఇష్టమైన రోజు కావడంతో అభిషేక పూజలను విశేషంగా చేపట్టారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకోగా, పూజారులు శ్రీస్వామి వారి ఆశీస్సులను అందజేశారు. ఇక ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్టా అలంకార మూర్తులకు సంప్రదాయ పూజలను కొనసాగించారు. ఆలయంలో వైభవంగా నిత్య కల్యాణ వేడుక, శ్రీసుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు వంటి పూజలు ఆచార్యులు జరిపించారు.

దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు రెండు ఎగ్జిబిట్లు


బీబీనగర్ జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఎగ్జిబిట్‌తో విద్యార్థులు, గైడ్ టీచర్


తుర్కపల్లి జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఎగ్జిబిట్‌తో విద్యార్థిని వైష్ణవి

భువనగిరి : ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలో భువనగిరి జిల్లాకు చెందిన రెండు ఎగ్జిబిట్లు దక్షిణ భారత వైజ్ఞానిక (సౌత్ ఇండియన్ సైన్స్ ఫెయిర్) ప్రదర్శనకు ఎంపిక య్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో ఈ నెల 30, 31వ తేదీల్లో జరగనున్న పోటీల్లో ఈ ఎగ్జిబిట్లను ప్రదర్శించనున్నట్లు డీఈవో కె నారాయణరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి భరణీకుమార్ సోమవారం తెలిపారు. దక్షిణ భారత స్థాయి సైన్స్ ఫెయిర్‌కు రాష్ట్రం నుంచి ఎంపికైన 25 ఎగ్జిబిట్లలో భువనగిరి జిల్లాలోని బీబీనగర్, తుర్కపల్లి జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన రెండు ఎగ్జిబిట్లు ఉన్నాయి.

హమాలీలు లోడ్ సులభంగా మోసే పరికరం

హమాలీలు వస్తువులను సులభంగా లోడ్ చేసే పరికరాన్ని రూ.1300 నుంచి రూ.1500 ఖర్చుతో తయారు చేయవచ్చు. ప్రస్తుతం హమాలీలు బరువైన వస్తువులను తల, భుజంపై మోస్తూ శారీరక బాధలు అనుభవిస్తున్నారు. వీటికి చెక్ పెట్టే విధంగా పరికరం రూపొందించాం. ఎంత బరవు మోసినా ఆ బరువు శరీరంలోని అన్ని భాగాల పై విభజించడం ద్వారా సలభంగా వస్తువులను అనుకున్న ప్రదేశానికి లోడర్ పరికరం ద్వారా చేర్చవచ్చు.

– కె.సాయితేజచారి, జి.కిరణ్, 9వ తరగతి, బీబీనగర్, జడ్పీహెచ్‌ఎస్

పువ్వులను రీసైక్లింగ్

దేవాలయాలు, శుభకార్యాలలో వాడి పడేసిన పువ్వులను రీసైక్లింగ్ చేయవచ్చు. వాడి పడేసిన పువ్వులను సేకరించి వాటిని ఎండబెట్టాలి. అనంతరం వాటిని రీసైక్లింగ్ చేయడం ద్వారా అగర్‌బత్తులు, దోమల నియంత్రణ కాయిల్స్, డెకరేటివ్ వస్తువులను తయారు చేయవచ్చు.

– టి.వైష్ణవి, 9వ తరగతి, జడ్పీహెచ్‌ఎస్ తుర్కపల్లి

గుర్తుతెలియని వృద్ధుడు మృతి


వృద్ధుడి మృతదేహం

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టుపైన గల శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. గట్టుపైన ఎల్లమ్మ ఆలయం సమీపంలో వృద్ధుడి మృతదేహాన్ని సోమవారం ఉదయం ఆలయ జూనియర్ అసిస్టెంట్ ఈర్ల శ్రీనివాస్‌రెడ్డి గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనారోగ్య కారణాలతో మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి వద్ద ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆలయ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

ఆటో, బైక్ ఢీ.. ఒకరి దుర్మరణం

అనంతగిరి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా మరొకరికి గాయాలయ్యాయి. అనంతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. అనంతగిరి మండలం బొజ్జగూడెం గ్రామానికి చెందిన ధరావత్ బాలాజి(53) పొలం వద్ద పనులు ముగించుకుని కోదాడ వైపు నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో తమర్మరబండపాలెం వద్ద కోదాడ వైపు వస్తున్న ఆటో ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో బాలాజి అక్కడికక్కడే మృతిచెందగా ఆటో డ్రైవర్ దాసాజు నాగేంద్రబాబుకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఆటో డ్రైవర్ నాగేంద్రబాబును ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతుని భార్య నీలాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అనంతగిరి ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

రామగిరి(నల్లగొండ): చోరీ కేసులో పోలీసులు ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. తిప్పర్తి మండలం పెద్ద సూరారం గ్రామానికి చెందిన కొమ్మనబోయిన సుశీల ఈ నెల 21న వ్యవసాయ బావికి వెళ్లి వస్తుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం రాయినిగూడెం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సీసీ టీవీలో చూసిన బైక్‌పై నిడమనూరు మండలం ముకుందాపురానికి చెందిన సల్లంగుల శివకుమార్, నల్లగొండ మండలం చందనపల్లికి చెందిన సంపంగి యువరాజులు ఉండటంతో వారిద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా నల్లగొండ పట్టణానికి చెందిన సంపంగి వెంకటేష్‌తో చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ ధర్మ తెలిపారు.

వేర్వేరు చోట్ల ఉరేసుకుని ఇద్దరి ఆత్మహత్య


నాగు మృతదేహం

నాంపల్లి : వేర్వేరు చోట్ల ఉరేసుకుని ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. నాంపల్లి, వలిగొండ మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. నాంపల్లి మండలం రాజ్యతండాకు చెందిన రమావత్ నాగు(36) తాపీ మేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. సమీప గ్రామానికి చెందిన ఓ మహిళతో నాగు కొంతకాలంగా సఖ్యతగా మెలుగుతున్నాడు. ఇద్దరు కలసి రోజు వారీలా నాంపల్లి మండలంలోని పగిడిపల్లి గ్రామానికి ఆదివారం ఓ ఇల్లు నిర్మాణం చేయడానికి వెళ్లారు.అక్కడ ఇద్దరి మధ్య గొడవ జరగడంతో నాగు మనస్తాపం చెంది. అక్కడినుంచి వెళ్లిపోయాడు. అనంతరం గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అనుమానంతో ప్రియురాలు వెతుక్కుంటూ రాగా నాగు చెట్టుకు వెలాడుతూ విగతజీవుడిగా కనిపించాడు. విషయం తెలుసుకున్న మృతిడి కుటుంబ సభ్యులు, బంధువులు నాగు ప్రియురాలి ఇంటి ఎదుట ధర్నాకు దిగారు. పోలీసులు రంగప్రవేశం ఆందోళనను విరమింపజేశారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

గొల్నేపల్లిలో..

వలిగొండ : వలిగొండ మండలం గొల్నేపల్లి గ్రామానికి చెందిన రాధారపు రమేష్(30) ఏ పని చేయకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆదివారం రాత్రి రమేష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించగా అప్పటికే మృతిచెందాడు. పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఆస్పత్రికి తరలించారు. రమేష్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేందర్ లాల్ తెలిపారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ

నేరేడుచర్ల: ప్రపంచ స్థాయి కరాటే పోటీలకు నేరేడుచర్లకు చెందిన కొణతం గమన్‌రెడ్డి అర్హత సాధించాడు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 28న జరిగిన రెండవ అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్–2024లో కొణతం గమన్‌రెడ్డి అండర్–20 కిలోల విభాగంలో గోల్డ్‌మెడల్‌ను సాధించి ప్రపంచ స్థాయి పోటీలకు ఎంపిక య్యాడు. గమన్‌రెడ్డి అల్కాపూర్ టౌన్ షిప్‌లోని స్కాలర్ ఆకాడమీలో 3వ తరగతి చదువుతున్నాడు. గమన్‌రెడ్డి అర్హతను సాధించడం పట్ల తల్లిదండ్రులు ఉదయ్‌కుమార్‌రెడ్డి–శోభన దంపతులు, ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు అభినందించారు.